సాక్షి
రాజన్న సిరిసిల్ల

ఆదివారం | 29 | డిసెంబర్ | 2024



కమలం జోరు.. హస్తం హోరు

రివైండ్ 2024

- లోక్‌సభ ఎన్నికల్లో రెండు పార్టీల సత్తా
- డీలాపడ్డ బీఆర్‌ఎస్
- ప్రచారం చేసిన పీఎం మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్
- ముగిసిన సర్పంచ్, జెడ్పీ, మండల పరిషత్ సభ్యుల పదవీకాలం
- కాంగ్రెస్ కండువా కప్పుకున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్
- రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జగిత్యాల మర్డర్

ఈ ఏడాది లోక్‌సభ ఎన్నికల్లో కమలం జోరు.. హస్తం హవా కొనసాగింది. బీఆర్‌ఎస్ డీలా పడింది. రెండోసారి ఎంపీగా గెలిచి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా బండి సంజయ్ పదవీ బాధ్యతలు స్వీకరించగా, కాకా వారసుడిగా తొలిసారి పోటీ చేసిన ఆయన మనవడు గడ్డం వంశీకృష్ణ పెద్దపల్లి నుంచి గెలుపొందారు. వరుసగా రెండోసారి ఎంపీగా ధర్మపురి అర్వింద్ నిజామాబాద్ నుంచి విజయం సాధించగా, ఈటల రాజేందర్ తొలిసారి ఎంపీగా మల్కాజిగిరి నుంచి గెలిచారు. నాలుగు చోట్ల బీఆర్‌ఎస్ మూడో స్థానానికే పరిమితమైంది. బీఆర్‌ఎస్ నుంచి గెలిచిన జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ కాంగ్రెస్‌లో చేరడం, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడి హత్య, ముఖ్య నాయకుల సవాళ్లు, ప్రతి సవాళ్లు రాజకీయంగా పెను సంచలనంగా మారాయి. బండి సంజయ్, పొన్నం ప్రభాకర్‌ల మధ్య మాటల యుద్ధం, అసెంబ్లీలో మంత్రి పొన్నం, మాజీ మంత్రి గంగుల మధ్య కొనసాగిన కరీంనగర్ పంచాయితీ, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అరెస్ట్ ఉమ్మడి జిల్లాలో పొలిటికల్ హీట్‌కు కారణమయ్యాయి. సిరిసిల్ల కేంద్రంగా సాగిన ఫోన్ ట్యాపింగ్ సిగ్నల్స్ ఉమ్మడి జిల్లాను తాకడం రాజకీయ నేతల్లో కలకలం రేపింది. సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తవడంతో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. –సాక్షి ప్రతినిధి, కరీంనగర్







మార్చి 18: బీజేపీ ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం జగిత్యాల జిల్లాలో నిర్వహించిన విజయ సంకల్ప సభకు ప్రధాని మోదీ హాజరయ్యారు.
మే 08: వేములవాడ రాజన్నను దర్శించుకున్న ప్రధాని మోదీ. అనంతరం స్థానికంగా నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్నారు.

ఏప్రిల్ 30: కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు గెలుపు కోసం హుజూరాబాద్‌లో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి.
మే 01: టి.జీవన్‌రెడ్డిని ఎంపీగా గెలిపించాలంటూ కోరుట్లలో నిర్వహించిన బహిరంగ సభలో పాల్గొన్న సీఎం పాల్గొన్నారు.
మే 04: రాజారాంపల్లి, సిరిసిల్లలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు కోసం నిర్వహించిన బహిరంగ సభల్లో రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు.
మే 07: కరీంనగర్ ఎస్సారార్ కాలేజీ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభకు సీఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు.
నవంబర్ 20: వేములవాడ రాజన్నను దర్శించుకున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల బృందం. రూ.1,000 కోట్లకుపైగా అభివృద్ధి పనులు మంజూరు చేసి, వరాల జల్లు కురిపించారు.
డిసెంబర్ 04: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా యువ వికాసం పేరిట పెద్దపల్లిలో నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇతర మంత్రులు పాల్గొన్నారు. గ్రూప్–4 ఉద్యోగాలకు ఎంపికైన 9 వేల మందికి నియామక పత్రాలు అందజేశారు.

మార్చి 12: కరీంనగర్ కదనభేరి పేరిట లోక్‌సభ ఎన్నికల శంఖారావం పూరించిన మాజీ సీఎం కేసీఆర్.
ఏప్రిల్ 05: ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో ఎండిన పంటల పరిశీలనకు కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో పర్యటించిన మాజీ సీఎం కేసీఆర్.
మే 03: పెద్దపల్లి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు కోసం రామగుండంలో నిర్వహించిన రోడ్డు షోలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొన్నారు.
మే 05: వీణవంక ప్రజల ఆత్మీయ సమ్మేళనంలో మాజీ సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. జగిత్యాల రోడ్డు షోలో పాల్గొని, కొండగట్టులో ఓ హోటల్ వద్ద యువతులతో సెల్ఫీ దిగారు.
మే 09: బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి వినోద్ కుమార్ గెలుపు కోసం కరీంనగర్ రోడ్ షోలో పాల్గొన్నారు. - మిగతా 8లో▸

న్యూస్‌రీల్

సీఎం ఇచ్చిన హామీ నెరవేర్చాలి



సిరిసిల్లటౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీని సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే అమలు చేయాలని బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్షను 19వ రోజు శనివారం సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సమగ్ర శిక్ష ఉద్యోగులు పీటీఐ వస్తువులు తయారు చేసిన నిరసన తెలిపారు. బీజేపీ నాయకులు రెడ్డబోయిన గోపి, శీలం రాజు, రవీందర్, రాగుల రాజిరెడ్డి, అన్నల్‌దాస్ వేణు, గూడూరు భాస్కర్, దుమాల శ్రీకాంత్, ఆసాని రామలింగారెడ్డి, విష్ణు, చందు, రఘునాథరావు, ఎస్టీటీ యూనియన్ బాధ్యులు మధుసూదన్‌రావు, రమణారెడ్డి, బీసీ జన సభ ఓయూ ఫౌండర్ రాజారాంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'విద్యార్థుల జీవితాలతో ఆటలాడొద్దు'



సిరిసిల్లటౌన్: ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేయకుండా ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతోందని బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ఆరోపించారు. సిరిసిల్లలోని బీఆర్‌ఎస్ భవనంలో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ విడుదల చేస్తామన్న హామీని ఏడాదిగా అమలు చేయడం లేదన్నారు. బకాయిలు విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ముద్దం అనిల్, సాయి, వినయ్, కోడం వెంకటేశం, సమీ, అక్రమ్, సాయి, గణేశ్, విష్ణు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని నేరెళ్ల గురుకుల విద్యార్థిని గజ్జి శరణ్య సీఎం కప్ జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో సత్తాచాటింది. వరంగల్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఖోఖో క్రీడలో పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ రాధ తెలిపారు. పీఈటీ స్వాతి, విద్యార్థిని శరణ్యను ప్రిన్సిపాల్ అభినందించారు.

'వర్గీకరణ చేపట్టకపోతే పోరుబాట'



చందుర్తి(వేములవాడ): సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకపోతే ఫిబ్రవరి 3న రాష్ట్ర వ్యాప్త పోరాటానికి మాదిగల సిద్ధంగా ఉండాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు థామస్ కోరారు. చందుర్తిలో ఎమ్మార్పీఎస్ ఆఫీస్‌ను శనివారం ప్రారంభించారు. థామస్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి నాలుగు నెలలు గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు. ఈ పోరాటానికి ప్రతీ ఒక్కరు డప్పుతో హైదరాబాద్ తరలిరావాలని కోరారు. శంకరయ్య, ఆవునూరి ప్రభాకర్, ఎలగందుల భిక్షపతి, కానాపురం లక్ష్మణ్, దుమ్ము అంజయ్య, లింగంపల్లి బాబు, కుమ్మరి లచ్చయ్య, లింగంపల్లి వెంకటి, అర్జున్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యంపై నమ్మకం పెంచాలి

- జిల్లా వైద్యాధికారి రజిత



సిరిసిల్ల: ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచి, లక్ష్యాలను సాధించాలని జిల్లా వైద్యాధికారి ఎస్.రజిత సూచించారు. జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని శనివారం తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందుల స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. డాక్టర్ రజిత మాట్లాడుతూ రోగులతో మర్యాదగా మెదలాలని సూచించారు. వ్యాక్సినేషన్ సక్రమంగా చేయాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆస్పత్రి వైద్యురాలు కృష్ణవేణి, సిబ్బంది పాల్గొన్నారు.

మండలానికో చేపల మార్కెట్

- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు రామచంద్రం



చంద్రంపేట రైతువేదికలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం

సిరిసిల్ల: మండలానికో చేపల మార్కెట్ నిర్మించాలని, మత్స్యకార్మికులకు బీమా సౌకర్యం కల్పించాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సంఘం ప్రథమ సర్వసభ్య సమావేశం తీర్మానించింది. చంద్రంపేట రైతువేదికలో శనివారం జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు చొప్పరి రామచంద్రం అధ్యక్షతన జరిగింది. రామచంద్రం మాట్లాడుతూ సహకార సంఘంలో సభ్యులుగా ఉన్న 50 ఏళ్లు దాటిన వారికి ప్రభుత్వం పెన్షన్ అందించాలని కోరారు. చేపల పెంపకంపై రైతులకు ఆక్వా శిక్షణ కేంద్రం ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించాలని, ఐదేళ్ల కాలపరిమితి ముగిసిన సంఘాలకు రెన్యూవల్ చేయాలని కోరారు. గుర్తింపు కార్డులు, లైఫ్‌జాకెట్లు అందించాలని కోరారు. సిరిసిల్లలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం భవనానికి ప్రభుత్వం రెండు ఎకరాలు కేటాయించి, భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. చెరువులలోని చేపలకు బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జిల్లా మత్స్యశాఖ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.సౌజన్య ఆదాయ, వ్యయాలు వెల్లడించారు. డైరెక్టర్లు అంబటి శేఖర్, ఫణి శివరామకృష్ణ, నిమ్మల బాబు, జెట్టి దేవయ్య, పిట్టల బాబు, కూనబోయిన పర్శరాములు, గాడిచెర్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆన్‌లైన్‌లో సెలవు పెట్టాలి

- జనవరి 1 నుంచి అమలు
- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల: జిల్లాలో పనిచేసే ఉద్యోగులు జనవరి 1 నుంచి ఆన్‌లైన్‌లో సెలవు దరఖాస్తు చేయాలని అదనపు కలెక్టర్ ఎస్.ఖీమ్యానాయక్ కోరారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ–హెచ్‌ఆర్‌ఎం పోర్టల్ ద్వారా సెలవు మంజూరు దరఖాస్తు చేయాలని సూచించారు. దీనిపై ఉద్యోగులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఉద్యోగులు ఈ–ఆఫీస్ లాగిన్ ఐడీ వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యోగుల జాబితా, సమగ్ర వివరాలు ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఎస్‌డీసీ రాధాబాయి, సీపీవో శ్రీనివాసాచారి, జెడ్పీ సీఈవో వినోద్‌కుమార్, జిల్లా వ్యవసాయాధికారి అఫ్జల్‌బేగం, డీఎస్‌వో వసంతలక్ష్మి, జిల్లా పశువైద్యాధికారి రవీందర్‌రెడ్డి, పౌరసరఫరాల డీఎం రజిత, జౌళిశాఖ ఏడీ సాగర్, మిషన్ భగీరథ ఈఈ జానకి, ఎస్‌సీడీవో విజయలక్ష్మి, డీవైఎస్‌వో రాందాస్, వేములవాడ మున్సిపల్ కమిషనర్ అన్వేశ్, మైనింగ్ ఏడీ క్రాంతి పాల్గొన్నారు.

కొడుకుకు ప్రాణభిక్ష పెట్టండి



మంచంపట్టిన సమీర్



కొడుకును ఆదుకోవాలని వేడుకుంటున్న సమీర్ తల్లిదండ్రులు

- 19 ఏళ్లకే కిడ్నీవ్యాధితో మంచంపట్టిన యువకుడు
- సర్జరీకి రూ.12లక్షలు అవసరం
- ఆర్థికసాయం కోసం ఎదురుచూపులు

ఫోన్ పే : 7893132088
మహమ్మద్ నయీమ్‌పాషా
బ్యాంక్ ఖాతా : 62432397855
ఐఎఫ్‌సీ : 72228431693

వేములవాడ: ఉన్న ఊరిలో ఉపాధి లేక గల్ఫ్‌బాటపట్టిన తండ్రి కొద్ది రోజులకే ఇంటిబాట పట్టగా, ఎదిగొచ్చిన కొడుకు రెండు కిడ్నీలు పాడయి మంచానికి పరిమితమవడంతో ఆ కుటుంబం కష్టాల కడలిలో కొట్టుమిట్టాడుతోంది. గల్ఫ్ వెళ్లేందుకు చేసిన అప్పులు కుప్పలుగా మారుతుండగా, కొడుకు అనారోగ్యంతో బాధపడుతుండడం మరింత వేదనకు గురిచేస్తుంది. వేములవాడలోని మార్కెట్‌యార్డు రోడ్‌లో నివసించే నజీర్ చికెన్ సెంటర్‌లో పనిచేస్తుండగా, భార్య నజుమా బీడీ కార్మికురాలు. ఈ దంపతులకు ఇద్దరు కొడుకులు నయీమ్, సమీర్. చిన్న కుమారుడు డిగ్రీ చదువుతున్న మహమ్మద్ సమీర్(19) కిడ్నీ వ్యాధితో మంచంపట్టాడు. రెండు నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చికిత్స కోసం రూ.12లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పడంతో దాతల కోసం ఎదురుచూస్తున్నారు.

రేపటి కోసం.. మారుదాం



- నూతన నిర్ణయాల కోసం చేద్దాం.. చాలెంజ్
- దురలవాట్లను దూరం కొడదాం
- మంచి మార్గానికి బాటలు వేద్దాం
- సరి'కొత్త'గా ఏడాదిని ప్రారంభిద్దాం



ఎన్నో ఆనందాలు.. అనుభవాలు.. ఆలోచనలు.. విషాదాలు.. వివాదాలను చరిత్రలో కలిపేస్తూ.. 2024 ఏడాది ముగుస్తోంది. 2025 సరికొత్త ఆలోచనలకు స్వాగతం పలుకుతోంది. ఎప్పటిలాగే ఈసారి కూడా కొన్ని నిర్ణయాలు తీసుకుంటాం. మద్యం మానేద్దామని, సిగరెట్ ఆపేద్దామని. కొత్త సంవత్సరం ప్రారంభంలో మూడు, నాలుగు రోజుల పాటు నిష్టగా నియమాలను కొనసాగించినా మరేదో బలహీన క్షణంలోనో, స్నేహితులు మొహమాట పెట్టారనో, సాంఘిక మర్యాదలు పాటించకపోతే ఎలా అనో మనల్ని మనమే సర్దిచెప్పుకుని ఎప్పటిలాగే అవే అలవాట్లను పునఃప్రారంభిస్తాం. ఇదంతా చాలా మంది జీవితాల్లో సహజంగా జరిగేదే. అయితే, ఈ బలహీనతలే కాలం గడుస్తున్న కొద్దీ మార్చుకోలేని వ్యసనాలుగా మారిపోయి, మనల్ని, మన కుటుంబాలను కూడా ప్రభావితం చేస్తాయి. అందుకే ఈసారి తీసుకునే నిర్ణయాలను కచ్చితంగా అమలు చేసేందుకే కట్టుబడి ఉందాం. –సిరిసిల్ల కల్చరల్

మనకూ ఉండాలో రాజ్యాంగం..



పాలన వ్యవస్థకు రాజ్యాంగ అనుసరణ ఎంతముఖ్యమో.. కుటుంబ నిర్వహణకు ఓ రాజ్యాంగం ఉండి తీరాలి. పెరుగుతున్న ఖర్చులు, సరిపడని జీతం, శుభకార్యాలు, ఏటా పెరిగే ద్రవ్యోల్బణం.. ఇలాంటివన్నీ దృష్టిలో పెట్టుకొని, రోజువారీ ప్రణాళికను ఒకరోజు ముందే తయారు చేసి, పెట్టుకోవడం మంచిది.

ప్రమోషనా.. ఇంక్రిమెంటా?



ఎంత చాకిరీ చేసినా ఎదుగుదల లేని జీవితం బోరే. చేసే పనిలో పురోగతిని ఆశించకపోతే ఆదాయంపై ఆసక్తి ఉండదు. ఈ ఏడాదైనా ప్రమోషన్ సంపాదించాలి, ఇంక్రిమెంట్ సాధించాలన్న కనీస లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకొని, ఆ దిశగా పనులు, ప్రయత్నాలు ఉండేలా చూసుకోండి.

మద్యం మానేద్దాం..



మద్యపానం ఒకటి, రెండు రౌండ్లతో మొదలై ఎప్పుడు ఆపాలో తెలియనంత విచక్షణ కోల్పోతున్నాం. మద్యపానంతో ఆరోగ్యంతోపాటు ఆర్థికంగా చితికిపోవడం చాలా మందికి ఎదురయ్యే అనుభవమే. మద్యపానానికి దూరంగా ఉండాలన్న నిర్ణయాన్ని వచ్చే ఏడాది నుంచి కచ్చితంగా పాటించి తీరండి.

పొగ ప్రమాదమే..



పొగ తాగడం మీకు మాత్రమే కాదు మీ కుటుంబసభ్యుల ఆరోగ్యాన్ని కూడా పాడు చేస్తుందని తెలుసుకోండి. సిగరెట్ తాగాలన్న ఆలోచన ఎప్పుడొచ్చినా సరే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోండి. ఆ క్షణంలో ఏ చాక్లెట్ నోట్లో వేసుకున్నా మెల్లగా అలవాటు నుంచి దూరం జరగొచ్చు.

పొదుపు మంత్రం..



చేసే పని, ఉద్యోగం ఏదైనా సరే.. తద్వారా వచ్చే నెలసరి జీతమైనా, రోజువారీ పారితోషికమైనా సరే కనీసం 30 శాతం పొదుపు చేయాలన్న నిర్ణయం ఐదేళ్లలో మిమ్మల్ని లక్షాధికారుల్ని చేస్తుంది. ప్రతీ వంద రూపాయల్లో రూ.30 దాచిపెడితే చాలు, అది మిమ్మల్ని సమాజంలో ఎవరి ముందూ చేయి చాచే అవసరం లేకుండా చూస్తుంది.

జీవితానికి బీమా..



నమ్మి మనపై ఆధారపడ్డ కుటుంబసభ్యులకు మనం నమ్మకంగా ఇవ్వగలిగింది జీవిత బీమా ఒక్కటే. కాబట్టి కచ్చితంగా ఇన్సూరెన్స్ పాలసీ తీసుకోవాలి. నెలకు రూ. లక్షల ఆదాయం ఉండే వ్యక్తి తన మరణానంతరం రూ.50 లక్షల విలువ చేసే పాలసీలను ఎంచుకోవాలి.

ఆరోగ్య బీమా..



ఆరోగ్య అవసరాలు, చికిత్సల నిమిత్తం ప్రతి మనిషికీ ఆరోగ్య బీమా తప్పనిసరి. కోవిడ్ తర్వాత హెల్త్ పాలసీపై అవగాహన పెరిగినా 70 శాతం మంది దూరంగానే ఉన్నారు. కనీసం రూ.5 లక్షలకు తగ్గకుండా కవర్ చేసేలా ఆరోగ్య బీమా తప్పనిసరిగా తీసుకోండి.

బరువు కాదు.. పరువు



ఏటా కాలంతోపాటు సమాజంలో మన పరువు పెరగాలి.. కానీ, బరువు కాదని అందరూ గుర్తించాలి. రోజుకో అరగంట వ్యాయామం వాకింగ్, రన్నింగ్, సైక్లింగ్ ఏదైతే అది చేయాలి.

మీకు మీరే పోటీ..



జీవితంలో విజేతలుగా మారాలంటే వేరెవరితోనూ పోల్చుకోనవసరం లేదు. మీరు పోల్చుకోవాల్సింది నిన్నటి వరకు ఉన్న మీతో.. ఏడాది తర్వాత మీరుండాలని కోరుకున్న మీతోనే పోల్చుకోవాలి. మీకు మీరే పోటీ కండి.

కొత్త ఆలోచనలతో ముందుకు..



ఇల్లంతకుంట: మాది ఇల్లంతకుంట. నేను 2024లో పాత అలవాట్లకు గుడ్ బై చెబుతూ కొత్త ఆలోచనలతో ముందుకెళ్తా. అనారోగ్యకరమైన ఆహార పదార్థాలకు దూరంగా ఉంటా. ఉద్యోగరీత్యా ఉరుకులు పరుగుల జీవితంలో ఒత్తిడిని తగ్గించుకోవడానికి వ్యాయామం, మెడిటేషన్ చేయాలనుకుంటున్నాను. స్మార్ట్ ఫోన్ చూడటం తగ్గించాలనుకుంటున్నాను.
– ఎర్రోజు త్రిశూల్, ఐటీ క్లినికల్ రీసెర్చర్

నూతన ప్రాజెక్టులపై దృష్టి



హుజూరాబాద్: నేను వచ్చే ఏడాది ఫైనలియర్‌కు వెళ్తాను. కొత్త సంవత్సరంలో కొత్త ప్రాజెక్టులపై దృష్టి పెడతా. ఇందుకు కావల్సిన స్కిల్స్ నేర్చుకుంటా. అమ్మనాన్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. కాలేజీ నుంచి ఉద్యోగంతోనే బయటకొస్తా. – బొల్ల సౌమ్య, కిట్స్ ఇంజినీరింగ్ కళాశాల, సింగాపూర్

దురలవాట్లు మాని, సామాజిక సేవ



శంకరపట్నం: మొలంగూర్‌కు చెందిన మోరె గణేశ్ 2023 డిసెంబర్ 31న దురాలవాట్లు మాని, సామాజిక సేవ చేస్తానని శపథం చేశాడు. అనుకున్నట్లే మొలంగూర్‌కే చెందిన అనాథ బాలుడు చిట్యాల గణేశ్‌ను చదివిస్తున్నాడు. కంటిచూపు సమస్యతో బాధ పడుతున్న ఓ యువకుడు డిగ్రీ పూర్తి చేసేందుకు ఆర్థికసాయం చేశాడు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశాడు. ఊళ్లో పేదలకు ఇంటి స్థలం ఇచ్చి, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని రిలే నిరాహార దీక్ష చేశాడు. సెంట్రింగ్ పని, చిరువ్యాపారంలో వచ్చిన ఆదాయాన్ని సామాజిక సేవకు ఖర్చు చేస్తున్నాడు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


ప్రమాద స్థలంలో రాజేశ్ మృతదేహం

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులో సిరిసిల్ల–కామారెడ్డి ప్రధాన రహదారిపై శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు.. ముస్తాబాద్ మండలం ఆవునూర్‌కు చెందిన ఆగంరెడ్డి పొలాన్ని ట్రాక్టర్ డ్రైవర్ నర్సయ్య కేజ్‌వీల్స్‌తో దున్ని గ్రామానికి వెళ్తున్నాడు. ఈక్రమంలో తంగళ్లపల్లి మండలం చింతల్‌ఠాణా గ్రామానికి చెందిన గోకులకొండ రాజేశ్(32) ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా, నర్సయ్య ట్రాక్టర్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈప్రమాదంలో రాజేశ్ అక్కడికక్కడే మృతిచెందాడు. అదే సమయంలో ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపు వెళ్తున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి తన వాహనాన్ని ఆపి వెంటనే అంబులెన్స్‌కు సమాచారం అందించి రాజేశ్ మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియాసుపత్రికి తరలించారు. ఎస్సై రమాకాంత్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. డ్రైవర్ నర్సయ్యను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

కరెంట్‌షాక్‌తో రైతు మృతి


పొలంలో రైతు నర్సయ్య మృతదేహం


నర్సయ్య(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో శనివారం రాత్రి కరెంట్‌షాక్‌తో రైతు మృతిచెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. మండల కేంద్రానికి చెందిన ఎడ్ల నర్సయ్య శనివారం సాయంత్రం గ్రామ శివారులోని వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా విద్యుత్ స్తంభానికి గల సపోర్టు వైరుకు కరెంటు సరఫరా కావడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య మృతుడి కొడుకు, బీఆర్‌ఎస్ నాయకుడు ఎడ్ల సందీప్‌ను పరామర్శించారు. మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

విషజ్వరంతో ఒకరు..


లచ్చయ్య(ఫైల్)

కోనరావుపేట(వేములవాడ): మండల కేంద్రానికి చెందిన ఒకరు విషజ్వరంతో శనివారం మృతిచెందాడు. కోనరావుపేటకు చెందిన లోకుర్తి లచ్చయ్య(65) మూడు రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు సిరిసిల్ల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. రక్తకణాలు తగ్గాయని కరీంనగర్ తీసుకెళ్లాలని అక్కడి వైద్యులు రెఫర్ చేయడంతో వెంటనే తరలించారు. కరీంనగర్‌లో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం రాత్రి మృతిచెందాడు. మృతునికి భార్య గౌరవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే లచ్చయ్య డెంగీతో మృతిచెందినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. గ్రామంలో పరిసరాల శుభ్రత లేదని చర్చ సాగుతోంది.

కమలం జోరు.. హస్తం హోరు


బండి సంజయ్‌కుమార్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

▶మొదటిపేజీ తరువాయి

- లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను గత మార్చి 16న ఎన్నికల సంఘం ప్రకటించగా, ఏప్రిల్ 18 నుంచి నామినేషన్లు స్వీకరించారు. మే 13న పోలింగ్ జరగగా, జూన్ 4న ఫలితాలు వెల్లడయ్యాయి.
- కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌కుమార్ 5,85,116 ఓట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థి, కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావుపై 3,59,907 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2006 ఉప ఎన్నికల్లో కేసీఆర్‌కు మెజార్టీ 2.01 లక్షలు, 2014 ఎన్నికల్లో వినోద్‌కుమార్‌కు వచ్చిన 2.25 లక్షల మెజార్టీని బండి సంజయ్ బ్రేక్ చేశారు.
- కాకా వారసుడిగా రాజకీయ అరంగ్రేటం చేసిన గడ్డం వంశీకృష్ణ 4,75,587 ఓట్లు సాధించి, తన సమీప ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్‌పై విజయం సాధించారు. రాష్ట్రంలోనే అతి పిన్న వయస్సు గల ఎంపీగా రికార్డు సృష్టించారు.
- నిజామాబాద్ ఎంపీగా ధర్మపురి అర్వింద్ కాంగ్రెస్ అభ్యర్థి జీవన్‌రెడ్డిపై 1,09,241 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. దీంతో, ఆయన వరుసగా రెండోసారి పార్లమెంట్‌లో అడుగుపెట్టారు.

ఉమ్మడి జిల్లాలో నేతల పర్యటనలు

ఫిబ్రవరి 02: సర్పంచ్‌ల పదవీకాలం పూర్తవడంతో గ్రామాల్లో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది.

జూలై 04: జెడ్పీ, మండల పరిషత్ సభ్యుల పదవీకాలం పూర్తి. పరిషత్‌లలో ప్రత్యేకాధికారుల పాలన షురూ.

మే 06: పెద్దపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసె శ్రీనివాస్ గెలుపు కోసం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని జూనియర్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన బహిరంగ సభకు బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా హాజరయ్యారు.

మే 07: బీజేపీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం మంథనిలో నిర్వహించిన బహిరంగ సభకు రాజస్థాన్ సీఎం భజన్‌లాల్‌శర్మ వచ్చారు.

జూన్ 09: కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఎంపీ బండి సంజయ్ ప్రమాణస్వీకారం.

జూన్ 23: జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. దీన్ని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తీవ్రంగా వ్యతిరేకించారు. చివరికి అధిష్టానం మాటతో దిగివచ్చారు.

జూలై 19: రైతు భరోసాపై ఉమ్మడి జిల్లాస్థాయి సమావేశం. పాల్గొన్న మంత్రులు, రైతుల అభిప్రాయ సేకరణ.

సెప్టెంబర్ 14: ఉపముఖ్యమంత్రి హోదాలో భట్టి విక్రమార్క ధర్మపురి, పెద్దపల్లి నియోజకవర్గాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు.

అక్టోబర్ 23: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రధాన అనుచరుడు గంగిరెడ్డి హత్య రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది.

నవంబర్ 29: అల్గునూర్ చౌరస్తాలో నిర్వహించిన దీక్షాదివస్ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి కేటీఆర్.

డిసెంబర్ 01: పెద్దపల్లి కలెక్టరేట్‌లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా నీటిపారుదల ప్రాజెక్టులు, పౌరసరఫరాల శాఖపై నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.

డిసెంబర్ 18: కరీంనగర్‌లోని ఇందిరాభవన్‌లో కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి పురమళ్ల శ్రీనివాస్ సీనియర్ నాయకులపై సంచలన ఆరోపణలు చేశారు.

డిసెంబర్ 24: ప్రొటోకాల్ పాటించటం లేదంటూ పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యేలపై అసహనం వ్యక్తం చేయడం రాజకీయంగా చర్చకు దారితీసింది.

ప్రత్యేకాధికారుల పాలన..

ఉమ్మడి జిల్లాలోని గ్రామ పంచాయితీల్లో సర్పంచ్‌ల ఐదేళ్ల పదవీకాలం పూర్తవడంతో ఫిబ్రవరి 2 నుంచి ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభమైంది. అలాగే, ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుల పదవీకాలం పూర్తవడంతో పరిషత్‌లలో జూలై 4 నుంచి ప్రత్యేకాధికారుల పాలన అమల్లోకి వచ్చింది. బీసీ కులగణన చేపట్టిన తర్వాత స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం బీసీ కమిషన్ ఏర్పాటు చేయగా.. ఉమ్మడి జిల్లా సమావేశం నిర్వహించి, బీసీ సంఘాల నుంచి అభిప్రాయాలు సేకరించింది.

కార్పొరేషన్లలో కండువాల మార్పు..

లోక్‌సభ ఎన్నికల అనంతరం కరీంనగర్‌కు చెందిన పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు బీజేపీలో, కొందరు కాంగ్రెస్‌లో జాయిన్ అయ్యారు. రామగుండం కార్పొరేషన్ మేయర్ బంగి అనిల్‌కుమార్, పలువురు బీఆర్‌ఎస్ కార్పొరేటర్లు కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

రాజన్న సేవలో పీఎం, సీఎం..

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధాని మోదీ ఎములాడ రాజన్నను దర్శించుకొని అనంతరం కోడె మొక్కు చెల్లించుకున్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు రాజన్నను దర్శించుకున్నారు.


ఎన్నికల ప్రచారంలో జేపీ నడ్డా, తదితరులు


వంశీకి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


ఆర్‌డీవో కార్యాలయంలో అభివృద్ధి పనుల శిలాఫలకాలను ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎంతో మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు


పెద్దపల్లిలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో 36గంటల నిరసన దీక్షలో పాల్గొన్న ఆపార్టీ నాయకులు

నాంపల్లిగుట్టపై చిన్నచూపు

- అభివృద్ధి అంతంతే..
- కంపుకొడుతున్న పరిసరాలు
- ఇబ్బందులు పడుతున్న భక్తులు

వేములవాడఅర్బన్: శ్రీరాజరాజేశ్వరస్వామి అనుబంధ నాంపల్లిగుట్టపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం అభివృద్ధిపై పాలకులకు పట్టింపు కరువైంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా గుట్టను అభివృద్ధి చేయడం లేదని స్థానికులు, భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసినా అమలుకు నోచుకోలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం నాంపల్లిగుట్టను అభివృద్ధి చేయాలని కోరుతున్నారు.

గతంలో ప్రతిపాదిత పనులు ఇవీ..

- 2015లో అప్పటి సీఎం కేసీఆర్ నాంపల్లిగుట్టను సందర్శించిన సమయంలో అభివృద్ధి పనుల ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించారు. వేములవాడ టెంపుల్ డెవలప్‌మెంట్ అథారిటీ(వీటీడీఏ) పర్యాటకశాఖ దేవాదాయశాఖ అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. సుమారుగా 100 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుట్టపై సుమారు రూ.29కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.
- నాంపల్లి గుట్టపై నుంచి అందమైన పరిసర ప్రాంతాలను వీక్షించేందుకు మనోరమ వ్యూ పాయింట్ ఏర్పాటు.
- మధ్యమానేరు వ్యూ, హోటల్, రాతిశిలల మధ్య కోనేటి నిర్మాణం.
- గుట్టపై మహామండపం నిర్మాణం.
- కల్యాణ వేదిక, వసతిగృహాలు.
- బిర్లా ప్లానేటోరియం, ధ్యాన మందిరం.


శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం

- గుట్ట కింద నుంచి పైకి రోప్‌వే నిర్మాణం.
- గుట్టపైకి రెండు వరుసల ఘాట్‌రోడ్డు నిర్మాణం.

పేరుకుపోయిన సమస్యలు

- నాంపల్లిగుట్టపైన వాటర్ ఫౌంటేయిన్ నిరుపయోగంగా మారింది.
- వాటర్ ఫౌంటేయిన్ చుట్టూ గార్డెన్‌లో పిచ్చిమొక్కలు మొలిచాయి.
- గుట్టపై పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది.
- గుట్టపై నలుగురు స్వీపర్లు ఉన్నా.. అందులో ఇద్దరు లడ్డూ కౌంటర్‌లోనే ఉంటున్నారు.


నాంపల్లి గుట్టపై కాళీయమర్దనం

- మరో నలుగురు స్వీపర్లను నియమించాలి.
- తాత్కాలిక రేకులషెడ్లు, మినరల్ వాటర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి.
- కాళీయమర్దనం ఎదుట మరో వాటర్‌ట్యాంక్.
- భక్తులకు స్నానపు గదులు.
- గుట్టపై గల శ్రీహనుమాన్ ఆలయానికి దారి.
- పాతకోనేరును శుభ్రం చేయించాలి.
- నవనాటి సిద్ధులగృహను శుభ్రం చేయించాలి.
- గుట్టపై తాత్కాలిక మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి.
- కొత్తగా మరికొన్ని మరుగుదొడ్లు నిర్మించాలి.

గుట్టను అభివృద్ధి చేయండి



నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని అభివృద్ధి చేయడం లేదు. ప్రభుత్వాలు మారుతున్నా గుట్టపై అభివృద్ధి పనులు కావడం లేదు. నిత్యం భక్తుల సందడి, ఆహ్లాదకరంగా ఉండే నాంపల్లిగుట్టపై సౌకర్యాలు కల్పించాలి. – బొల్గం నాగరాజు, నాంపల్లి

వసతులు కల్పిస్తున్నాం



నాంపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి గుట్టపై భక్తులకు వసతులు కల్పిస్తున్నాం. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నాం. పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూస్తాం.

– నరేందర్, నాంపల్లి ఆలయ ఇన్‌చార్జి





పరమేశ్వరా.. పాహిమాం



వేములవాడ: వరుస సెలవులు, వీకెండ్‌తో రాజన్నకు భక్తుల రద్దీ పెరిగింది. శనివారం 25 వేల మంది దర్శించుకున్నారు. ధర్మగుండంలో పుణ్య స్నానాలు ఆచరించి కల్యాణకట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. కోడె, అభిషేకాలు, అన్నపూజ, కల్యాణాలు, సత్యనారాయణ వ్రతాల మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి కుంకుమపూజ, గండాదీపంలో నూనెపోసి గండాలు తొలగిపోవాలని మొక్కుకున్నారు. అనంతరం బద్దిపోచమ్మకు బోనం సమర్పించారు. భక్తుల ఏర్పాట్లను ఈవో వినోద్‌రెడ్డి, ఏఈవోలు శ్రీనివాస్, శ్రవణ్, జయకుమారి పర్యవేక్షించారు. రాజన్న అనుబంధ భీమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనిత్రయోదశి పూజలు చేశారు. భక్తులు భారీగా హాజరయ్యారు.

వికటించిన ఆర్‌ఎంపీ వైద్యం

- ఆస్పత్రికి తరలింపు..
- చికిత్స పొందుతూ మహిళ మృతి


కాశీంబీ(ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఆర్‌ఎంపీ వైద్యం నిండు ప్రాణాన్ని తీసింది. జ్వరంతో బాధపడుతున్న మహిళకు సూది మందు ఇవ్వడంతో వికటించి ప్రాణాల మీదకు వచ్చింది. ఇంజక్షన్ ఇచ్చిన కొద్ది సేపటికే సదరు మహిళ అస్వస్థతకు గురికాగా ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం వేకువజామున మృతిచెందింది. గ్రామస్తులు, బాధితులు తెలిపిన వివరాలు.. గంభీరావుపేట మండలం తుర్కాసిపల్లికి చెందిన షేక్ కాశీంబీ (35) రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. శుక్రవారం కుటుంబ సభ్యులు రాచర్లతిమ్మాపూర్‌కు చెందిన ఆర్‌ఎంపీ వైద్యుడికి చూపించారు. తీవ్ర జ్వరంతో ఉన్న కాశీంబీని పరీక్షించిన ఆర్‌ఎంపీ వెంటనే ఇంజక్షన్లతోపాటు సెలైన్ పెట్టాడు. చలిజ్వరంతో ఉన్న ఆమె అపస్మారకస్థితికి చేరింది. తాను చేసిన వైద్యం వికటించినట్లు గ్రహించిన ఆర్‌ఎంపీ వెంటనే కాశీంబీని తన కారులో మండల కేంద్రంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. అప్పటికే పరిస్థితి చేజారిపోవడంతో చికిత్సపొందుతూ మృతిచెందింది. కాశీంబీ మృతి వార్త తెలుసుకున్న ఆర్‌ఎంపీ తన ఇంటికి తాళం వేసి కుటుంబంతో సహా పరారయ్యాడు. ఎస్సై రమాకాంత్ ఆధ్వర్యంలో ఆర్‌ఎంపీ ఇంటి వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పెద్ద మనుషులు కూర్చుండి ఆర్‌ఎంపీ సమీప బంధువులతో మాట్లాడి బాధిత కుటుంబానికి పరిహారం అందజేశారు. దీంతో సమస్య సద్దుమణిగింది. మృతురాలికి భర్త అజీమ్, ఇద్దరు పిల్లలు అజిత్, సుల్తాన్‌బీ ఉన్నారు.

కేసు నమోదు.. క్లినిక్ సీజ్

అర్హతలు లేకున్నా వైద్యం చేస్తూ, ప్రజల ప్రాణాలు తీస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి హెచ్చరించారు. మృతురాలు కాశీంబీ భర్త ఫిర్యాదుతో ఆర్‌ఎంపీ దేవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తిమ్మాపూర్‌లో ఆర్‌ఎంపీ నిర్వహిస్తున్న క్లినిక్‌ను వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు ఏంజేలా ఆల్ఫ్రేడ్ ఆధ్వర్యంలో తనిఖీ చేసి, సీజ్ చేశారు. లింగన్నపేట వైద్యాధికారి అభినయ్ తదితరులు పాల్గొన్నారు.

గేదెను ఢీకొట్టి ఒకరి మృతి

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని వెంకటాపూర్ శివారులోని గాజులపల్లి వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. ఎస్సై రమాకాంత్ తెలిపిన వివరాలు. ఎల్లారెడ్డిపేట నుంచి సిరిసిల్ల వైపునకు వెళ్తున్న ద్విచక్ర వాహనదారుడు చీకట్లో గేదె కనిపించకపోవడంతో ఢీకొట్టి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని సిరిసిల్ల ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని వివరాలు పోలీసులు సేకరిస్తున్నారు.

విద్యుదాఘాతంతో దగ్ధమైన ఎలక్ట్రానిక్ పరికరాలు

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండల కేంద్రంలోని బస్టాండు ఏరియాలోని పలు ఇళ్లలో శనివారం సాయంత్రం విద్యుల్ సరఫరాలో అంతరాయంతో ఎలక్ట్రానిక్ వస్తువులు దగ్ధమయ్యాయి. హఠాత్తుగా హై, లో వోల్టేజీ సరఫరా కావడంతో బస్టాండ్ ఏరియాలోని దుర్గాభవాని కలర్‌ల్యాబ్‌లోని కంప్యూటర్లు, ప్రింటర్లు, సమీప హోటళ్లు, దుకాణాల్లోని ఫ్రిజ్‌లు, ఫ్యాన్‌లు, ఏసీలు దగ్ధమయ్యాయి.

సార్ల పోరుబాట.. విద్యార్థుల ఇంటిబాట



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ 19 రోజులుగా సమగ్రశిక్ష ఉద్యోగులు సమ్మెబాట పడితే.. విద్యార్థులు శనివారం ఇంటిబాట పట్టారు. ఉద్యోగులు సమ్మెలో ఉండడంతో చదువులు సాగడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు స్కూళ్లకు వచ్చి వారి పిల్లలను తీసుకెళ్లారు.

31న హుండీ లెక్కింపు

వేములవాడ: 'నిండిన రాజన్న హుండీలు' శీర్షికతో ఈనెల 27న సాక్షిలో ప్రచురితమైన కథనానికి ఆలయ అధికారులు స్పందించారు. ఈనెల 31న ఓపెన్‌స్లాబ్‌లో హుండీ లెక్కింపు చేపట్టనున్నట్లు ఆలయ ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి శనివారం ప్రకటనలో తెలిపారు. ఆలయ అధికారులు, సిబ్బంది సకాలంలో స్వామి వారి ఓపెన్‌స్లాబ్‌లో హాజరు కావాలని ఈవో సూచించారు.

వెబ్‌సైట్ అప్‌డేట్ చేస్తున్నారు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): జిల్లా ప్రభుత్వ వెబ్‌సైట్‌లో అధికారుల సమాచారం ఎప్పటికప్పుడు పొందుపరచడం లేదని 'జిల్లా వెబ్‌సైట్ అప్‌డేట్ చేయరా?' శీర్షికన సాక్షిలో శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేసి బదిలీ అయిన వీర బుచ్చయ్య స్థానంలో డీఆర్డీవో శేషాద్రి పేరును పొందుపర్చారు. కానీ ఎంపీవోలు, గ్రామాల వారీగా పంచాయతీ సిబ్బంది సమాచారం అప్‌డేట్ చేయాల్సి ఉంది.

6న తుది ఓటరు జాబితా


మాట్లాడుతున్న ఆర్డీవో రాజేశ్వర్

వేములవాడ అర్బన్: అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించిన వివిధ రాజకీయ పార్టీల నేతలతో శనివారం వేములవాడ అర్బన్ తహసీల్ ఆఫీస్‌లో ఆర్డీవో రాజేశ్వర్ సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఓటరుగా నమోదు చేసుకున్న పట్టభద్రులు, టీచర్స్ తుది జాబితాను ఈ నెల 30న ప్రకటించనున్నట్లు తెలిపారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ ఓటరు నమోదు జాబితాను జనవరి 6న ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ మహేశ్‌కుమార్, రాజకీయ పార్టీల నాయకులు పొలాస నరేందర్, మైలారము రాము, పిన్నింటి హన్మాండ్లు, రామస్వామిగౌడ్ తదితరులు ఉన్నారు.

యాసంగికి మిడ్‌మా‘నీరు’

- ప్రారంభమైన నీటి విడుదల
- మార్చి 31 వరకు కొనసాగింపు
- 53వేల ఎకరాల ఆయకట్టు
- ప్రాజెక్టులో 26 టీఎంసీలు


శ్రీరాజరాజేశ్వర ప్రాజెక్టు

బోయినపల్లి(చొప్పదండి): జిల్లాలోని యాసంగి పంటలకు సాగునీరు అందించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. మిడ్‌మానేరు కుడికాల్వ ద్వారా 56వేల ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది. ఈనెల 25 నుంచి 2025 మార్చి 31 వరకు నీటి విడుదల చేస్తామని మిడ్‌మానేరు ఈఈ జగన్ తెలిపారు. గేట్ల ద్వారా ఎల్‌ఎండీ ఆయకట్టుకు, ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా మిడ్‌మానేరు ఆయకట్టుకు సాగునీరు అందించనున్నారు. ప్రాజెక్టులో ప్రస్తుతం 26.02 టీఎంసీల నీరు ఉంది.

53వేల ఎకరాలకు..

బోయినపల్లి మండలంలోని మిడ్‌మానేరు ప్రాజెక్టులో 26 టీఎంసీల మేర నీరు నిల్వ ఉండడంతో ప్రభుత్వ ఆదేశాలతో పంటలకు సాగునీరు అందిస్తామని అధికారులు పేర్కొంటున్నారు. కుడికాల్వ ద్వారా రోజుకు 250 క్యూసెక్కులు విడుదల చేయడం ద్వారా 53,424 ఎకరాల్లోని పంటలకు సాగునీరు అందనుంది. కుడికాల్వ కింద ఇల్లంతకుంట, గన్నేరువరం, తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, సైదాపూర్, కోహెడ మండలాల్లోని ఆయకట్టు భూములకు నీరందనుంది. ఎడమకాల్వ కింద బోయినపల్లి, కొత్తపెల్లి మండలాల్లోని 5వేల ఎకరాల్లోని పంటలకు సాగు నీరందాలి. అయితే ఎడమకాల్వ కింద డిస్ట్రిబ్యూటరీ కాల్వలు సరిగ్గాలేవు.

ఎల్‌ఎండీ ఆయకట్టుకు సాయంగా సాగునీరు

కరీంనగర్‌లోని ఎల్‌ఎండీ నీటి నిల్వ సామర్థ్యం 24 టీఎంసీలు కాగా 9 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. ప్రస్తుతం మిడ్‌మానేరు ఒక గేటు ద్వారా ఎల్‌ఎండీకి 500 క్యూసెక్కుల మేర నీరు విడుదల చేస్తున్నారు.

మిడ్‌మానేరు ప్రాజెక్టు

ప్రాజెక్టు సామర్థ్యం : 27.50 టీఎంసీలు

ఆయకట్టు : 53,424 ఎకరాలు

కుడికాల్వ కింద మండలాలు : ఇల్లంతకుంట, గన్నేరువరం, తిమ్మాపూర్, మానకొండూర్, చిగురుమామిడి, సైదాపూర్, కోహెడ

నీటి విడుదల : 250 క్యూసెక్కులు

ఎల్‌ఎండీకి విడుదల : 500 క్యూసెక్కులు

మిడ్‌మానేరు నుంచి సాగునీరు



మిడ్‌మానేరులో 26 టీఎంసీల మేర నీరు నిల్వ ఉంది. యాసంగి పంటలకు ఈనెల 25 నుంచి నీటి విడుదల ప్రారంభించాం. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ వరకు నీటి విడుదల కొనసాగుతోంది. యాసంగిలో ప్రాజెక్టు నీటితో కుడికాల్వ కింద ఏడు మండలాల రైతులకు చెందిన 53వేల ఎకరాలకు సాగునీరు అందించాలని ప్రభుత్వ ఆదేశాలు ఉన్నాయి.

– జగన్, మిడ్‌మానేరు, ఈఈ